సాక్షి
నాగర్‌కర్నూల్
గురువారం । 25 । మే । 2023



100 పడకల ఆస్పత్రి

జడ్చర్లలో నిర్మించిన వంద పడకల ఆస్పత్రిని శనివారం మంత్రి హరీశ్‌రావు ప్రారంభిస్తారు.

వివరాలు 8లో ►



మరింత తగ్గిన ఉల్లి ధర

దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లి క్వింటా గరిష్టంగా రూ.వెయ్యి, కనిష్టంగా రూ.400 పలికింది.

వివరాలు 10లో ►

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.4 /26.7

ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై తేలిక పాటి వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తు చేసుకోండి

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులకు ఈ నెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక పిడియాట్రిక్, ఒక మెడికల్ ఆఫీసర్ డెంటల్, 3 ఫిజియోథెరపిస్టు, ఒక ఆడియాలజి, స్పీచ్ థెరపిస్టుపోస్టులతో పాటు ఒక సోషల్ వర్కర్, 2 ల్యాబ్ టెక్నీషియన్, 5 స్టాఫ్‌నర్సు, ఒక డెంటల్ టెక్నీషియన్, 2 ఫార్మాసిస్టు, 5 ఎంపీహెచ్‌ఏ, ఒక మేనేజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పూర్తి వివరాలకు www.nagarkurnool.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. దరఖాస్తులను డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందజేయవచ్చని పేర్కొన్నారు. ఆయా పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేయనున్నట్లు వివరించారు.

రాష్ట్ర బ్రాహ్మణ సదన్ ప్రారంభానికి తరలిరండి



కందనూలు: ఈ నెల 31న హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా రాష్ట్ర బ్రాహ్మణ సదన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి తరలిరావాలని తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్యులు జోషి గోపాలశర్మ కోరారు. బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ బ్రాహ్మణ అభ్యున్నతికి అనేక పథకాలను ప్రవేశపెట్టారని, గోపన్‌పల్లిలో 10 ఎకరాల్లో రూ.10 కోట్లు వెచ్చించి అన్ని హంగులు, సదుపాయాలతో బ్రాహ్మణ సదన్ నిర్మించారని చెప్పారు. అనంతరం పదో తరగతి, ఇంటర్‌లో ఫలితాల్లో ప్రతిభకనబరిచిన పేద బ్రాహ్మణ విద్యార్థులను జై పరశురాం సేవా సంస్థ ద్వారా సన్మానించారు. కార్యక్రమంలో భూదానం సుబ్బారావు, భీంసేన్‌రావు, బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు మురళీధర్‌రావు, దిలీప్, భరత్, రాజశేఖర్‌రావు, సురేందర్‌రావు, జగన్ మోహన్‌రావు, వెంకటేశ్వరశర్మ, మధుసూదన్ శర్మ, వెంకటరమణ, మహబూబ్‌నగర్ జిల్లా బాధ్యుడు రాఘవేంద్రశర్మ పాల్గొన్నారు.

టెండర్ల స్వీకరణ

కందనూలు: జిల్లాలోని 10 మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను కిరాణ సరుకులు, క్యాటరింగ్, కూరగాయలు ఇతర సామగ్రి సరఫరా కోసం అర్హులైన సంస్థలు, వ్యక్తుల నుంచి టెండర్లు స్వీకరిస్తున్నట్లు అదనపు కలెక్టర్ మోతీలాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిన్సిపల్, మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనకబడిన తరగతుల గురుకుల విద్యాలయం (బాలికలు) నాగర్‌కర్నూల్ జిల్లా పేరిట ఎస్‌బీఐ నాగర్‌కర్నూల్‌లో డీడీ తీసి, ఈ నెల 26 నుంచి 31 వరకు సంబంధిత ధ్రువపత్రాలు, డీడీలను ఉయ్యాలవాడలోని గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేయాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 91211 07774ను సంప్రదించాలని సూచించారు.

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత

బల్మూర్: ప్రతిఒక్కరు దైవచింతన కలిగి ఉంటేనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి అన్నారు. మండలంలోని బాణాలలో నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం ఎంపీ రాములు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, బీజేపీ నాయకులు సతీష్‌మాదిగ, గ్రామపెద్దలతో ఆయన ప్రత్యేక పూజలు చేయించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అందరినీ ఒకచోట కలిపేది ఆలయం ఒక్కటేనని.. ప్రతిఒక్కరు నిత్యం ఆలయాలను దర్శించుకొని దేవుని దీవెనలు పొందాలని త్రిదండి సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



విత్తనాల ఎంపికే కీలకం



రైతులకు విత్తనాలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

- పంటల సాగులో మేలైన రకాలను ఎంచుకోవాలి
- అందుబాటులో వడగళ్ల వానలను తట్టుకునే వరి రకాలు
- రైతులు స్వల్పకాలిక పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి
- పాలెం పరిశోధన స్థానంలో నిర్వహించిన విత్తనమేళాలో శాస్త్రవేత్తలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా హాజరైన రైతులు

సాక్షి, నాగర్‌కర్నూల్: పంటల సాగులో రైతులు మేలైన విత్తనాలను ఎంపిక చేసుకోవడమే కీలకమని పాలెం వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెం వ్యవసాయ పరిశోధన స్థానంలో బుధవారం రైతులతో కలిసి 'విత్తన మేళా' కార్యక్రమం నిర్వహించారు. పరిశోధన స్థానంతో పాటు పాలెం కృషి విజ్ఞానకేంద్రంలో అందుబాటులో ఉన్న విత్తనాల రకాలను ఈ మేళాలో ప్రదర్శించారు. స్థానిక స్థితిగతులకు అనుగుణంగా ఎలాంటి విత్తనాలను ఎంచుకోవాలన్న అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఆడిటోరియంలో 'శాస్త్రవేత్తలు– రైతులతో చర్చాగోష్టి' కార్యక్రమం చేపట్టి.. రైతులు అడిగిన ప్రశ్నలకు శాస్త్రవేత్తలు సమాధానమిచ్చారు. దీర్ఘకాలికం కంటే స్వల్పకాలిక పంటల సాగుకే ప్రాధాన్యం ఇవ్వాలని వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీ మల్లారెడ్డి తెలిపారు. అకాల వర్షాలు, వడగళ్ల వానలకు వరి పైరు, గింజ నేలరాలకుండా తట్టుకుని నిలబడగలిగే విత్తన రకాలు పాలెం పరిశోధనా స్థానంలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రైతులు వీటిని సాగు చేసి నష్టాలను తగ్గించుకోవాలని సూచించారు. వానాకాలం సీజన్‌లో మార్కెట్‌లో డిమాండ్ ఉన్న సన్నరకం వరి పంటను సాగుచేయడం ద్వారా రైతులు ఆదాయం పెంచుకోవాలని కోరారు. గతంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎక్కడ చూసినా పెబ్బర్లు, కందులు, రాగులు వంటి చిరుధాన్యాలు ఎక్కువగా కనిపించేవని, ప్రస్తుతం వరిసాగు ఎక్కువగా ఉంటుందన్నారు. అయితే మిశ్రమ పంటల సాగుతోనే రైతులకు లాభదాయకం అని వివరించారు. ఏడాదికోసారి పంటల మార్పిడి ద్వారా చీడపీడలు, తెగుళ్ల నుంచి విముక్తి పొందడంతోపాటు భూసారాన్ని కాపాడుకోవచ్చన్నారు. పత్తి పంటలోనూ దీర్ఘకాలిక రకాల కంటే స్వల్పకాలిక, గింజ పొడవుగా ఉండే రకాలను ఎంచుకోవాలని కోరారు.

అందుబాటులో మేలైన విత్తనాలు

పాలెం పరిశోధనా స్థానంతోపాటు కృషి విజ్ఞాన కేంద్రంలో వరి, కందులు, జొన్న, పచ్చజొన్న, వేరుశనగ పంటల సాగుకు మేలైన విత్తన రకాలు అందుబాటులో ఉన్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు. వానాకాలం సీజన్‌లో సన్నరకాలకు డిమాండ్ ఉన్న ఆర్‌ఎన్‌ఆర్– 15048 సన్నరకానికి చెందిన వరి విత్తనాలను నాటుకోవాలని సూచించారు. దొడ్డు రకాల్లో అకాల వర్షాలను తట్టుకునే జేజీఎల్– 24423 రకం విత్తనాలు సాగు చేయాలని చెబుతున్నారు.

సేంద్రియ సాగు వైపు..



పంటల సాగులో అవసరానికి మించి డీఏపీ, యూరియా ఎరువుల వినియోగం ఉంటోంది. దీంతో ఎరువులు వృథా కావడంతో పాటు పెట్టుబడి ఖర్చు పెరుగుతోంది. రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయాలి. రైతులు ఎక్కువగా నాటు విత్తనాలు సాగు చేయడం అలవాటు చేసుకోవాలి. మార్కెట్‌లో హైబ్రీడ్ విత్తనాలకు రేట్లు పెంచి, బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. అధికారులు రేట్లను అదుపులో ఉంచేలా చర్యలు తీసుకోవాలి.

– లావణ్య, రైతు, కార్వంగ, తెలకపల్లి మండలం

స్వల్పకాలిక వంగడాలపై..



రైతులకు ప్రధానంగా స్వల్పకాలిక పంటలైన వరి విత్తనాలపై అవగాహన కల్పిస్తున్నాం. అకాల వర్షాలు, వడగళ్ల నుంచి తట్టుకునేందుకు జేజీఎల్– 24423, సన్నరకాల్లో ఆర్‌ఎన్‌ఆర్– 15048 రకాలను సూచిస్తున్నాం. మార్కెట్లో డిమాండ్ ఎక్కువగా ఉన్న రకాల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– తరుణ్, సీడ్ ఆఫీసర్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ

మిశ్రమ పంటలకు ప్రాధాన్యం

రైతులు సంప్రదాయ పంటల సాగుకు భిన్నంగా మిశ్రమ పంటలను సాగు చేయాలి. కొద్దిపాటి భూమిలోనే ఎక్కువ పంటలను సాగుచేయడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చు. రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకునేందుకు అవగాహన కల్పించాం. వరి, కందులు, జొన్నలు వంటి పంటల సాగుకు మేలైన రకాల విత్తనాలను పరిశోధన స్థానంలో అందుబాటులో ఉంచుతున్నాం.

– మల్లారెడ్డి, ఏడీఆర్, పాలెం వ్యవసాయ పరిశోధన స్థానం

అప్రమత్తంగా ఉండాలి

వానాకాలం సీజన్ మొదలుకానున్న నేపథ్యంలో రైతులు మేలైన విత్తనాలపై అవగాహన పెంచుకుని, నాసిరకం విత్తనాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని నాగర్‌కర్నూల్ జిల్లా వ్యవసాయ శాఖాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. నాణ్యమైన విత్తనాలు పాలెం కేవీకే, పరిశోధన కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఆధీకృత డీలర్ల నుంచి విత్తనాలను కొనుగోలు చేయాలని, రైతులు తప్పనిసరిగా రసీదు పొందాలని సూచించారు. రసీదు ఉంటే సదరు వ్యక్తులపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. పంట మొదట్లోనే మొలకల శాతం తక్కువగా ఉంటే విత్తనాలను మార్చుకోవడం ద్వారా పంట నష్టాన్ని, ఖర్చును తగ్గించుకోవచ్చన్నారు. విత్తనాల లభ్యత వివరాలు, ఇతర సమస్యలను సంబంధిత వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు నలిని, వాణిశ్రీ, పుష్పవతి తదితరులు పాల్గొన్నారు. విత్తన మేళాకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రైతులు తరలివచ్చారు.



విత్తన మేళాకు హాజరైన ఉమ్మడి జిల్లాలోని రైతులు

ధాన్యం కొనుగోలు వేగిరం చేయాలి

- కలెక్టర్ ఉదయ్‌కుమార్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

కందనూలు: అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని వరిధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర పౌరసరఫరాలు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ వరిధాన్యం కొనుగోలు ప్రక్రియపై కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో హైదరాబాద్ నుంచి వీసీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైస్ మిల్లుల్లో లారీలు ఎక్కువ రోజులు నిలవకుండా, వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు అన్‌లోడింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేవలం లారీలను మాత్రమే కాకుండా ట్రాక్టర్లను సైతం ఉపయోగించుకోవాలని సూచించారు. ధాన్యం ఎఫ్‌సీఐ నిబంధనల మేరకు కొనుగోలు చేసి రైస్ మిల్లులకు పంపాలన్నారు. మిల్లులకు తడిసిన ధాన్యం ఎక్కువగా వస్తుందని, ఇతర రాష్ట్రాల నుంచి ఏమాత్రం ధాన్యం రాకుండా చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టం చేయాలన్నారు. రైస్ మిల్లుల్లో ధాన్యం పెట్టుకోవడానికి స్థల సమస్య ఉంటే జిల్లాలోని ఇతర గోదాంలను తాత్కాలిక పద్ధతిలో అప్పగించి ధాన్యం నిల్వ చేయాలని కోరారు. జిల్లాలో ఇప్పటికే 45,538 మె.ట., ధాన్యం కొనుగోలు చేశామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి మోహన్‌బాబు, మేనేజర్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



తెలకపల్లిలో గర్భిణితో మాట్లాడుతున్న సుధాకర్‌లాల్

తెలకపల్లి: ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్ అన్నారు. బుధవారం తెలకపల్లి, పెద్దూరులోని పీహెచ్‌సీలు, చిన్నముద్దునూరులోని ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్ల వారీగా వ్యాక్సిన్ డిస్ట్రిబ్యూషన్ రికార్డులను పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న ఆరోగ్య కేంద్ర భవనాన్ని సందర్శించారు. అందుతున్న వైద్యసేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలోని అన్ని సబ్ సెంటర్లలో వ్యాక్సిన్ పంపిణీ ఎలా జరిగింది.. గర్భిణులకు అందుతున్న సేవలపై సమీక్షించారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు, ఏఎన్‌ఎంలు అందుబాటులో ఉండాలన్నారు. వేసవి కావడంతో వడదెబ్బ తగిలే అవకాశం ఉందని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రవికుమార్, కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి ప్రదీప్, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గడ్డంపల్లిలో 'మన ఊరు– మన చరిత్ర' బృందం

తెలకపల్లి: మన ఊరు– మన చరిత్ర ప్రాజెక్టులో భాగంగా జిల్లా కోఆర్డినేటర్ మల్లికార్జున్ మండలంలోని గడ్డంపల్లిని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 96 ఏళ్ల మక్తాల నర్సింహ తదితరులను కలిసి గ్రామ చరిత్ర గురించి తెలుసుకున్నారు. ఒకప్పుడు గుడిసెతో కూడిన బొంతగడ్డ, బొంతతాడూరు అనే రెండు పేర్లతో పిలిచేవారని, ప్రస్తుతం గ్రామం ఉన్న స్థలానికి సంచార వంశమున గడ్డం కలిగిన ఒక వ్యక్తి వచ్చి స్థిరపడ్డారని వివరించారు. రెండు గ్రామాల ప్రజలు ప్లేగు వ్యాధి, ఇతర కారణాలతో గడ్డమీదికి వచ్చి గ్రామాన్ని నిర్మించుకున్నారని, ప్రస్తుతం ఉన్న గౌతంపల్లి గ్రామ స్థలానికి వెళ్లి గ్రామాన్ని నిర్మించుకున్నారన్నారు. ఆ ఊరు నిర్మాణం చేయడం వల్ల గడ్డంపల్లి అని పేరు వచ్చిందని తెలిపారు. గ్రామంలోని శివాలయం దగ్గర ఉన్న శాసనం ఉందని, హనుమంతుడి శిలమీద కూడా ఒక శాసనం ఉందని, గ్రామం కేంద్రంగా రెడ్డి వంశస్థులు అనంతసాగర్, గౌతంపల్లి, గట్టురాయిపాకుల గ్రామాలను గతంలో పరిపాలించారని చెప్పారు. వసూలైన శిస్తులో 25 శాతం నిజాం నవాబుకు చెల్లించేవారన్నారు. గ్రామంలో వనపర్తి సంస్థానాధిపతి పెద్దరాజ రామేశ్వర్‌రావు భార్య శంకరమ్మ, ఈ గడికి చెందిన రామచంద్రారెడ్డి భార్య రామచంద్రమ్మ ఆమె అక్కాచెల్లెళ్లు రామచంద్రమ్మకు కట్నంగా బుద్దారం దగ్గర 400 ఎకరాలు ఇచ్చారని, స్వాతంత్ర్యానికి ముందే ఈ వంశానికి చెందిన రామచంద్రారెడ్డి తదితరులు లండన్‌లో స్థిరపడ్డారన్నారు. స్వాతంత్ర్య సమయంలో వెయ్యి ఎకరాలు కలిగి సీలింగ్ యాక్ట్ కింద 500 ఎకరాలు ప్రజలకు పంచిపెట్టిన గ్రామవాసి లింగోజిరావు కమ్యూనిస్టు పార్టీలో పనిచేశారని, రజాకార్లకు, భూస్వాములకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటాన్ని నిర్వహించినట్లు తెలుసుకున్నారు.



గ్రామస్తులతో వివరాలు సేకరిస్తున్న మల్లికార్జున్

ముగిసిన 'సీఎం కప్' జిల్లాస్థాయి పోటీలు



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్ తదితరులు

- రాష్ట్రస్థాయికి 21 జట్ల ఎంపిక

కందనూలు: జిల్లాకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి 'సీఎం కప్' పోటీలు బుధవారం అట్టహాసంగా ముగిశాయి. కబడ్డీ ఫైనల్‌లో పెద్దకొత్తపల్లి జట్టుపై తిమ్మాజీపేట విజయం సాధించగా.. వాలీబాల్ ఫైనల్‌లో పదర జట్టుపై తిమ్మాజీపేట ఆల్‌రౌండర్ ప్రదర్శనతో గెలుపొందగా.. పదర జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ పోటీలు 86 జట్లతో మూడు రోజులపాటు సాగిన క్రీడా పండగలో వెయ్యి మంది పాల్గొన్నారు. ప్రతిభ చూపిన 11 క్రీడాంశాల్లో పాల్గొనేందుకు 21 జట్లను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. విజేతలకు అదనపు కలెక్టర్ మోతీలాల్ జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ టోర్నీ నిర్వహిస్తోందన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 28న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారుల్లో ప్రతిభతోపాటు పోరాట పటిమ పుష్కలంగా ఉందని, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలన్నారు. జిల్లాస్థాయి క్రీడలను విజయవంతంగా నిర్వహించిన డీవైఎస్‌ఓ నటరాజు అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి పాండు, ఒలింపిక్ రాష్ట్రస్థాయి అబ్జర్వర్ యాదయ్యగౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు సీతారాంనాయక్, నిరంజన్, రమేష్, శేఖర్‌బాబు, సుభాషిణి, రామన్‌గౌడ్, శిరీష, స్వరూప, చంద్రకళ, మల్లయ్య, పర్వతాలు, జ్ఞానేశ్వరి, వెంకటేష్, సూర్యనారాయణ, వెంకటేశ్వరశెట్టి తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

జిల్లా స్థాయిలో 21 జట్లు అత్యంత ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యాయి. పోటీల్లో భాగంగా అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, హ్యాండ్‌బాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్, బాక్సింగ్, బ్యాడ్మింటన్ పోటలు నిర్వహించారు. మహిళా విభాగంలో కబడ్డీలో ఊర్కొండ మండలం ప్రథమ, వెల్దండ మండలం ద్వితీయ స్థానం సాధించగా, ఖోఖోలో బిజినేపల్లి మండలం ప్రథమ, వంగూరు మండలం ద్వితీయ, వాలీబాల్‌లో అచ్చంపేట మండలం ప్రథమ, తిమ్మాజిపేట జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.

పురుషుల విభాగంలో..

కబడ్డీలో తిమ్మాజిపేట మండలం ప్రథమ, పెద్దకొత్తపల్లి మండలం ద్వితీయ, వాలీబాల్‌లో తిమ్మాజిపేట ప్రథమ, పదర రన్నర్‌గా నిలిచింది. ఖోఖోలో వెల్దండ మండలం ప్రథమ, తెలకపల్లి మండలం ద్వితీయ, ఫుట్‌బాల్‌లో నాగర్‌కర్నూల్ మండలం ప్రథమ, హ్యాండ్‌బాల్ మొదటి స్థానం సాధించాయి. బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్‌లో పెద్దకొత్తపల్లి మండలం ప్రథమ, బాక్సింగ్‌లో పదర మండలం విజేతగా నిలిచింది.

కాంగ్రెస్‌లో జోష్ నింపేలా..

- నేడు జడ్చర్లలో పీపుల్స్ మార్చ్' బహిరంగ సభ
- హాజరుకానున్న హిమాచల్ సీఎం, ఠాక్రే, రేవంత్ తదితరులు
- లక్ష మంది వరకు వస్తారని నేతల అంచనా
- ఉమ్మడి జిల్లాలో ప్రతి నియోజకవర్గం నుంచి వాహనాల ఏర్పాటు



బహిరంగసభ కోసం జడ్చర్ల డిగ్రీ కళాశాలలో చేస్తున్న ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: వచ్చే ఎన్నికల్లో సత్తా చాటి.. అధికారంలోకి రావాలనే సంకల్పంతో కాంగ్రెస్ ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా శాసన సభా పక్ష నేత మల్లు భట్టి విక్రమార్క ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. మార్చి 16న బోథ్ నియోజకవర్గంలోని పిప్పిరి నుంచి ప్రారంభమైన యాత్ర వివిధ జిల్లాల్లోని పలు నియోజకవర్గాల మీదుగా ఈ నెల 16న మహబూబ్‌నగర్ జిల్లాలోకి ప్రవేశించింది. ఆ తర్వాత నవాబుపేట మండలంలోని పలు గ్రామాల గుండా బుధవారం జడ్చర్ల మండలంలోని బండమీదిపల్లికి చేరుకుంది. ఇప్పటివరకు 69 రోజులుగా 800 కిలోమీటర్ల మేర పాదయాత్ర కొనసాగగా.. జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం నిర్వహించనున్న భారీ బహిరంగసభకు కాంగ్రెస్ నేతలు ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

భారీగా జనసమీకరణ..

కర్ణాటక ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత తెలంగాణలో నిర్వహిస్తున్న ఈ బహిరంగసభను కాంగ్రెస్ అధిష్టానం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. లక్ష మంది తరలివస్తారనే అంచనాకు అనుగుణంగా టీపీసీసీ కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా నేతలు భారీ జనసమీకరణకు సన్నాహాలు మొదలుపెట్టారు. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాలతోపాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చేలా వాహనాలు సమకూర్చారు.

హిమాచల్ సీఎం, ఠాక్రే, రేవంత్ రాక..

సభ సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభం కానుండగా.. ముఖ్య అతిథిగా హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖుతోపాటు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తదితర నేతలు హాజరుకానున్నారు. సుఖ్వీందర్‌సింగ్ గురువారం మధ్యాహ్నం విమానమార్గం ద్వారా చండీఘర్ నుంచి ఢిల్లీకి చేరుకోనున్నారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు చేరుకుని.. ఎయిర్‌పోర్టు ఆవరణలోని నోవాటెల్ కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటారు. ఆ తర్వాత సాయంత్రం 5.45 గంటలకు రోడ్డు మార్గం ద్వారా జడ్చర్లకు బయలుదేరుతారు. సాయంత్రం 6.45 గంటలకు జడ్చర్లలోని బహిరంగసభ ప్రాంగణానికి చేరుకోనున్నారు. సభ అనంతరం ఆయన రాత్రి 8:30 గంటలకు రోడ్డు మార్గంలో తిరిగి హైదరాబాద్‌కు.. 9.55 గంటలకు విమానంలో ఢిల్లీకి బయలుదేరనున్నారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా రాష్ట్ర పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశారు. సభలో ఏఐసీసీ కార్యదర్శి బోసురాజు, రోహిత్ చౌదరి, నదీమ్ జావిద్, ఎంపీలు ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ, ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు సీతక్క, వీరయ్య, జగ్గారెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, గద్దర్ తదితరులు పాల్గొననున్నట్లు మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి తెలిపారు. పాదయాత్రలో ప్రజలు వివరించిన సమస్యలను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎలా పరిష్కరిస్తుందో సభ ద్వారా నేతలు వివరిస్తారని వెల్లడించారు. బహిరంగసభ నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం తొణికిసలాడుతోంది.

పీపుల్స్ మార్చ్ సభను జయప్రదం చేయండి

కందనూలు: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్రలో భాగంగా జడ్చర్లలో నిర్వహించే బహిరంగ సభకు తరలిరావాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ అవినీతి, అక్రమాలు, అనాలోచిత నిర్ణయాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజల బాధలను, రైతులు ఎదురవుతున్న దయనీయ పరిస్థితులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆదిలాబాద్ జిల్లా నుంచి ఖమ్మం వరకు 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర చేపట్టారన్నారు. బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుక్కుతోపాటు ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరవుతారన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బుధవారం వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. ఆయా ఘటనలకు సంబంధించి వివరాలిలా..

జడ్చర్ల: జడ్చర్ల సమీపంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి 11గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరు గాయపడ్డారు. ఎస్ఐ లెనిన్ కథనం మేరకు.. ఏపీలోని కర్నూల్ జిల్లా నంద్యాలకు చెందిన చిరంజి హర్షవర్ధన్(24), అతని మిత్రుడు అభిషేక్ కలిసి మోటార్ బైక్‌పై హైదరాబాద్ నుంచి నంద్యాలకు వెళ్తుండగా చిట్టిబోయిన్‌పల్లి వద్ద బైక్ అదుపు తప్పి జాతీయ రహదారి పక్కన రక్షణ కొరకు ఏర్పాటు చేసిన గార్డ్ గ్రిల్స్‌ను ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న హర్షవర్ధన్, అభిషేక్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే హర్షవర్ధన్ మృతి చెందాడు. వెనుక కూర్చున్న అభిషేక్ గాయాలతో బయటపడ్డాడు. మృతుడి తండ్రి చిరంజి చిన రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌లు ఢీకొని..

జడ్చర్ల మండలంలోని గంగాపూర్–గోప్లాపూర్ ప్రధాన రహదారిపై బుధవారం రెండు మోటార్ బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని ఒకరు దుర్మరణం చెందగా మరొకరు గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం కాకునూర్ గ్రామానికి చెందిన గుత్తి కుమార్(45) ట్రాక్టర్‌లో మొక్కజొన్నను బాదేపల్లి మార్కెట్‌లో విక్రయించేందుకు వస్తున్నాడు. ట్రాక్టర్ ముందు వెళుతుండగా కుమార్ మోటర్ బైక్‌పై వస్తున్నాడు. ఈక్రమంలో ఎదురుగా మరో మోటార్‌బైక్‌పై గుర్తు తెలియని వ్యక్తి అతివేగంగా వచ్చి కుమార్ బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో కుమార్ అక్కడికక్కడే చనిపోయాడు. మరో బైక్‌పై వచ్చిన వ్యక్తి గాయపడడంతో అతనిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లెనిన్ తెలిపారు.

కలుకుంట్ల శివారులో వ్యక్తి..

శాంతినగర్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శాంతినగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కలుకుంట్ల గ్రామ శివారులో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మద్దూరుకి చెందిన కుర్వ మద్దిలేటి (40) కలుకుంట్ల దేవరకు వెళ్లి మోటార్‌సైకిల్‌పై తిరిగి వస్తుండగా కలుకుంట్ల బ్రిడ్జిపై అప్పుడే బోల్తా పడిన వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో మద్దిలేటి రోడ్డుపై పడిపోవడంతో తీవ్రగాయాలై.. రక్తస్రావం జరగడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని అలంపూర్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు..

కోయిల్‌కొండ: ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం మండలంలోని జమాల్‌పూర్ దగ్గర చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మద్దూరు మండలం లింగాల్‌చేడ్ గ్రామానికి చెందిన కనకప్ప(26) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో వ్యవసాయ పనుల నిమిత్తం బైండింగ్ వైర్ తీసుకు వస్తానని ఇంటి నుంచి కోయిల్‌కొండకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా జమాల్‌పూర్ డంపింగ్ యార్డు సమీపంలో ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కనకప్పను స్థానికులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై కనకప్ప భార్య చెన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

బొలెరో ఢీకొని రైతు, ఎద్దు..

బిజినేపల్లి: మండలంలోని మంగనూర్ గ్రామ శివారులో కాడెద్దుల బండిని, బొలెరో వాహనం ఢీకొంది. దీంతో రైతు బొట్క వెంకటయ్య(50)తోపాటు అతని ఒక ఎద్దు మృతి చెందింది. బుధవారం రాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వెంకటయ్య తన భార్యతో కలిసి వెల్గొండ కాలనీ నుంచి కాడెద్దుల బండిమీద ఇంటికి మంగనూర్ బయలుదేరారు. గ్రామ సమీపంలోని కేఎల్ఐ కాల్వ సమీపాన వెళ్తుండగా వెనకాల వస్తున్న బొలెరో వాహనం ఎద్దులబండిని వేగంగా ఢీకొంది. దీంతో ఒక ఎద్దు, రైతు అక్కడికక్కడే మృతి చెందారు. రైతు భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను 108 వాహనంలో చికిత్స కోసం నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

ఓపీ నుంచి 100 పడకల ఆస్పత్రి


ప్రారంభానికి సిద్ధంగా 100 పడకల ఆస్పత్రి

నాడు బాదేపల్లిలో చెట్టుకింద ప్రారంభమైన ఆస్పత్రి

- దినదినాభివృద్ధి చెందుతున్న వైనం
- 27న మంత్రి హరీశ్‌రావుచే ప్రారంభం
- పేదలకు చేరువగా మెరుగైన వైద్య సేవలు

జడ్చర్ల టౌన్: చెట్టుకింద ప్రారంభమైన బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రి నేడు 100 పడకల వరకు అభివృద్ధి చెందింది. పట్టణ శివారు కల్వకుర్తి రోడ్డులో నిర్మించిన ఈ ఆస్పత్రిని శనివారం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించనున్నారు. ఆస్పత్రి ప్రారంభమైతే జడ్చర్ల మండలంతోపాటు మరో 50 గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేరువ కానున్నాయి. ఆస్పత్రికి సంబంధించిన ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం 11 గంటలకు ఆస్పత్రిని ప్రారంభించనున్నారు.

ఓపీ సేవలతో ప్రారంభం

1960లో ఆరోగ్య ప్రజాసంచాలకుల శాఖ బాదేపల్లికి ఆస్పత్రిని మంజూరు చేసింది. ఆ సమయంలో ఎలాంటి భవనాలు లేకపోవడంతో ప్రస్తుత కమ్యూనిటీ హెల్త్ సెంటర్ స్థలంలో చెట్టు కింద టేబుల్ వేసి వైద్యసేవలు ప్రారంభించారు. ఆస్పత్రి కోసం నాటి స్వాతంత్ర్య సమరయోధులు కొత్త కేశవులు, ఖండెరావు, గుండెరావు, జంగయ్యయాదవ్ లాంటి వారు ప్రయత్నించి 1961లో రెండు గదులు నిర్మింపజేసి అందులో వైద్యసేవలు అందులోకి తీసుకువచ్చారు. ఆ తర్వాత 6 పడకలు, 16 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చెందుతూ వచ్చింది. చాలాకాలం తర్వాత 1999లో 30 పడకల కమ్యూనిటీ ఆస్పత్రి మంజూరు చేసి పాతభవనం కూల్చి కొత్తగా నిర్మించారు. ఆ భవనంలో 2003లో 30 పడకల ఆస్పత్రిని ప్రారంభించి వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. 2018లో 100 పడకల ఆస్పత్రికి శిలాఫలకం వేశారు. ప్రస్తుత కమ్యూనిటీ హెల్త్ సెంటర్ స్థలం చాలదని గంగాపురం రోడ్‌లో నూతనంగా నిర్మాణం చేపట్టారు.

నూతన ఆస్పత్రిలోనే వైద్య సేవలు

నూతనంగా ప్రారంభించబోయే ఆస్పత్రిలోనే ఇకపై పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. ఆస్పత్రిలో రెండు మేజర్, 2 మైనర్, 1 సెమీ మైనర్ ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేశారు. అప్పుడే పుట్టిన చిన్నారుల కోసం ఒక ఎస్ఎన్‌సీయూ, డెడికేటెడ్ పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు నెలకొల్పారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందించేందుకు ఐసీయూ, వెంటిలేటర్ సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. అదేవిధంగా రక్తనిల్వ కేంద్రం త్వరలో ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం బాదేపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఉన్న వైద్యులు, సిబ్బంది అంతా నూతన భవనంలోనే సేవలు అందించనున్నారు. 100 పడకల ఆస్పత్రికి సరిపోయే వైద్యులు, సిబ్బందిని త్వరలోనే నాగర్‌కర్నూల్, వనపర్తిలోని ఏరియా ఆస్పత్రుల నుంచి బదిలీపై ఇక్కడికి తీసుకురానున్నారు.


ఐసీయూ

గర్వంగా ఉంది..



100 పడకల ఏరియా ఆస్పత్రి మున్సిపాలిటీ పరిధిలోని 3 వార్డులో ఉండటం మేం గర్వంగా ఫీలవుతున్నాం. రోజురోజుకు పట్టణం అభివృద్ధి చెందుతున్న సమయంలో 100 పడకల ఆస్పత్రి ప్రారంభించడం వల్ల ప్రజలకు మెరుగైన వైద్యం చేరువ చేసినట్లవుతుంది. వెంటిలేటర్ సౌకర్యం లేక మహబూబ్‌నగర్ ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తుంది. ఇప్పుడు ఆ అవసరం లేకుండా ఇక్కడే అందుబాటులోకి వైద్యసేవలు అందుతాయి.

– సతీష్, 3 వార్డు కౌన్సిలర్, జడ్చర్ల

నూతన భవనంలోనే..



కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో అందిస్తున్న వైద్య సేవలతోపాటు అదనంగా ఇచ్చే సేవలన్నీ 29 నుంచి నూతన భవనంలోనే అందిస్తాం. డయాలసిస్ సెంటర్, ఎన్‌సీయూ, డెడికేటెడ్ పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్‌యూనిట్, ఐసీయూ, వెంటిలేటర్ లాంటి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మెరుగైన చికిత్స అందించేందుకు వీలవుతుంది.

– సోమశేఖర్, డీసీహెచ్‌ఎస్, సూపరింటెండెంట్, బాదేపల్లి ఆస్పత్రి

మెరుగైన వైద్యం



స్థానికంగా ఉన్న ప్రజలతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషిచేస్తున్నాం. అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి స్థానికంగానే వైద్యం అందించేందుకు 100 పడకల ఏరియా ఆస్పత్రి అనువుగా మారుతుంది. రెండు జాతీయ రహదారులు జడ్చర్ల మీదుగా వెళ్తున్నందున ఆస్పత్రికి ఎంతో ప్రాధాన్యం కలుగుతుంది. ఈ నెల 27న మంత్రి హరీశ్‌రావు ఆస్పత్రిని ప్రారంభిస్తారు.

– లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

మెరుగైన పరిహారం ఇప్పించండి


ఉదండాపూర్ రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న భట్టి విక్రమార్క తదితరులు

- అధికారులు కోర్టు ఆదేశాలను పట్టించుకోవడం లేదు
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్కతో ఉదండాపూర్ నిర్వాసితుల మొర

జడ్చర్ల: 'తరతరాలుగా అనుభవిస్తూ జీవనోపాధి పొందుతున్న తమ భూములను బలవంతంగా లాక్కొని రోడ్డున పడేశారు.. అదేమని నిలదీస్తే పోలీసులతో బెదిరిస్తున్నారు.. తమకు న్యాయం చేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించాం.. కోర్టు ఆదేశాలను సైతం అధికారులు పట్టించుకోకుండా తమను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు' అని ఉదండాపూర్ భూ నిర్వాసితులు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కతో మొర పెట్టుకున్నారు. భట్టి చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర బుధవారం కిష్టారం గ్రామం నుంచి ఉదండాపూర్ రిజర్వాయర్‌కు చేరుకుంది. ముందుగా రిజర్వాయర్ కట్టను పరిశీలించిన భట్టి అనంతరం భూ నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉదండాపూర్‌కు చెందిన యాదయ్య, మల్లయ్య, లక్ష్మమ్మ, జంగయ్య, నాగమ్మ తదితరులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. తమకు 5.18 ఎకరాల భూమి ఉండగా ధరణిలో కేవలం 18 గుంటలు మాత్రమే కనిపిస్తుందని మిగతా 5 ఎకరాలు ప్రొహిబిషన్ రికార్డులో ఉందన్నారు. నిషేధిత జాబితా నుంచి తమ భూమిని మార్చాలని ఎన్నిసార్లు తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ల చుట్టు తిరిగినా పట్టించుకోవడం లేదన్నారు. 2013 భూ పరిహార చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించి స్టే ఆర్డర్ తీసుకువచ్చినా రెవెన్యూ అధికారులు ఖాతర్ చేయడం లేదని, పైగా పోలీసులతో బెదిరిస్తూ తనకున్న 1.08 ఎకరాలను స్వాధీనపర్చుకుని కట్ట నిర్మించారని రైతు మల్లయ్య వాపోయారు. దాదాపు 400 ఎకరాలకు సంబంధించిన రైతులం న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించగా.. ఇంజక్షన్ ఆర్డర్ ఇస్తూ కొత్త పాసుపుస్తకాలు జారీ చేయాలని, రైతుబంధు, రైతుబీమా తదితర పథకాలు వర్తింపజేయాలని ఆదేశించినా పట్టించుకోవడం లేదన్నారు. బలవంతంగా తమ భూములను ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని, ఎక్కడికక్కడ పెద్దఎత్తున యంత్రాలతో గుంతలు తీయడంతో పంటలు సాగు చేసుకోలేక కూలీ పనులతో జీవనం గడిపే పరిస్థితి నెలకొందన్నారు. నిర్వాసితుల మొరను ఆలకించిన భట్టి విక్రమార్క అధికారులు, ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాలకులకు పదవులు శాశ్వతం కాదని, అధికారులు మాత్రం ఉంటారన్నారు. అధికారులు చట్టబద్ధంగా వ్యవహరించాల్సి ఉండగా పాలకులకు కొమ్ముకాయడం సరికాదన్నారు. భూమికి మనిషికి విడదీయరాని బంధం ఉంటుందని, ఇలాంటి వ్యవహారాల్లో నిర్వాసితుల అభ్యర్థన మేరకు ప్రభుత్వం వారిని ఒప్పించి మెప్పించి భూ సేకరణ చేయాలని హితవు పలికారు.

న్యాయం కోసం పోరాడండి

న్యాయం కోసం అంతా ఏకమై ప్రభుత్వంపై పోరాడాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో భట్టి మాట్లాడారు. 2013 చట్టం ప్రకారంగా భూ పరిహారం ఇవ్వాల్సి ఉండగా ప్రభుత్వం తక్కువ ధరలకు రైతుల నుంచి లాక్కోవడం సరికాదన్నారు. పునరావాస ప్రక్రియ సైతం సక్రమంగా నిర్వర్తించకపోవడం దారుణం అన్నారు. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. అధికారుల బెదిరింపులకు, పోలీసుల హూంకరింపులకు భయపడవద్దని సూచించారు. చట్టప్రకారంగా ప్రభుత్వం నిర్వాసితులకు న్యాయం చేయాలన్నారు.

ప్రాజెక్టులకు వ్యతిరేకం కాదు

తాము ప్రాజెక్టులకు వ్యతిరేకం కాదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి స్పష్టం చేశారు. 2013 చట్ట ప్రకారం భూ విలువను సవరించి అందుకు మూడు రెట్లు పరిహారం అందించాలన్నారు. కుల వృత్తిదారులకు, వ్యవసాయ కూలీలకు సరైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చి అన్ని మౌలిక సదుపాయాలతో త్వరితగతిన పునరావాసం కల్పించాలన్నారు. పాలమూరు ప్రాజెక్టు ఆలస్యంకావడానికి కాంగ్రెస్ నాయకులు కారణమని అధికార పార్టీ నేతలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాము ఎక్కడా ఎప్పుడు పనులు ఆపాలని చూడలేదన్నారు. తక్కువ ధరలకు పంపులు కొనుగోలు చేసి ఎక్కువ ధర కోట్ చేయడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తూ ఆధారాలతో సహా నాగం జనార్దన్‌రెడ్డి కోర్టులో కేసు వేశారన్నారు. గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేసిన కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ఇప్పుడు బీఆర్ఎస్‌లోనే ఉన్నారని గుర్తుచేశారు. టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక పోలీసులు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. గురువారం జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు చెరుకు సుధాకర్, రమేష్, బడంగ్‌పేట మేయర్ పారిజాత తదితరులు పాల్గొన్నారు.

ఘరానా దొంగ చెంచు లక్ష్మి ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న మహబూబ్‌నగర్ ఎస్పీ కె.నరసింహ

- 15 చోరీల కేసులు ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ కె.నరసింహ

మహబూబ్‌నగర్ క్రైం: ఒక గ్యాంగ్‌గా ఏర్పడి, తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వందల సంఖ్యలో దొంగతనాలు చేసిన అంతర్రాష్ట్ర దొంగల మహిళల ముఠాను మహబూబ్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం సాయంత్రం ఎస్పీ కె.నరసింహ, తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన చెంచు లక్ష్మీ అలియాస్ గడ్డం లక్ష్మీ ప్రస్తుతం కర్నూల్ జిల్లాలోని ఎమ్మిగనూర్ మిలటరీ కాలనీలో నివాసం ఉంటోంది. అయితే చెంచు లక్ష్మీ 16వ ఏట నుంచే దొంగతనాలు చేయడం మొదలుపెట్టింది. అదే కాలనీకి చెందిన ఎరుకలి పద్మ, ఎరుకలి మరియ, ఎరుకలి రేణుక అనే ముగ్గురు మహిళలను కలుపుకుని ఒక గ్యాంగ్ ఏర్పాటు చేసుకుంది. ఈ ముఠా పలు జిల్లాలు, రాష్ట్రాలు తిరుగుతూ తాళాలు వేసిన ఇళ్లు లక్ష్యంగా..ఉదయం రెక్కీ నిర్వహించి రాత్రివేళ చోరీలు చేస్తారు. చెంచులక్ష్మీ గ్యాంగ్ మూడు నెలల్లో జిల్లాలో పదిచోట్ల చోరీలు చేశారు. చెంచులక్ష్మీపై తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కలిపి దాదాపు 100వరకు కేసులు ఉన్నాయి. పీడీయాక్ట్‌పై కూడా జైలుశిక్ష అనుభవించింది. కొన్నాళ్లు పరివర్తనలో భాగంగా చంచల్‌గూడ జైలువద్ద ఉన్న పెట్రోల్ బంకులో పని చేసింది. చివరగా అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనం కేసులో గత ఏడాది డిసెంబర్‌లో జైలుకు వెళ్లి ఈఏడాది మార్చి 3న విడుదల అయ్యింది. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత మహబూబ్‌నగర్‌లో రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 7దొంగతనాలు, దేవరకద్రలో ఒకటి, గద్వాలలో రెండు దొంగతనాలు చేసింది. చెంచులక్ష్మీతో పాటు ఎరుకలి పద్మ, ఎరుకలి రేణుకను అరెస్టు చేయగా మరియ పరారీలో ఉంది. వీరి నుంచి 70గ్రాముల బంగారం, 731గ్రాముల వెండి, రెండు చేతిగడియారాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాను పట్టుకోవడానికి ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి, సాంకేతిక టెక్నాలజీ సహాయంతో పట్టుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

మరో అంతరాష్ట్ర దొంగకు రిమాండ్

పశ్చిమగోదావరి జిల్లా తణుకు చెందిన కొండపురి రామకృష్ణ మొదట కొబ్బరి బొండాల వ్యాపారం చేసేవాడు. దాంట్లో నష్టం రావడంతో అవసరాలకు సరిపడా డబ్బులేదని భావించి 2006లో హైదరాబాద్ దొంగతనాలు చేశాడు. ఆ కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడు. ప్రస్తుతం కూరగాయల వ్యాపారం చేస్తున్నా విలాసవంత జీవితానికి డబ్బు సరిపోవడంలేదని చోరీలను ఎంచుకున్నాడు. ఉదయం వేళలో తాళాలు వేసిన ఇళ్లను రెక్కీ నిర్వహించి రాత్రివేళలో దొంగతనాలు చేయడం మొదలు పెట్టాడు. ఇతను జిల్లాలో 2021, 22 ఏడాదిలో కూడా భూత్పూర్ పరిధిలోని సారిక టౌన్ షిప్‌లో, అలాగే భూత్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు దొంగతనాలు చేశాడు. అతనిపై చాలా రోజులుగా నిఘా ఉంచిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి అదుపులోకి తీసుకున్నారు. రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు. అతని నుంచి 10.4 తులాల బంగారం, రూ.5వేల నగదు రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ రెండు కేసులు దర్యాప్తు చేసి దొంగలను పట్టుకోవడంలో ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ రివార్డులతో అభినందించారు. సమావేశంలో డీఎస్పీ టి.మహేష్, సీఐలు రాజేశ్వర్‌గౌడ్, రజితరెడ్డి, ఎస్ఐలు భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి

గద్వాల క్రైం: చికిత్స పొందుతూ గుర్తుతెలియని ఓ మహిళ మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ రామస్వామి తెలిపారు. ఈనెల 21న పట్టణంలోని తేరుమైదానం సమీపంలో ఓ మహిళ(49) స్పృహతప్పి పడిపోగా స్థానికులు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బుధవారం ఉదయం చికిత్స పొందుతూ ఆమె మృతి చెందిందని వైద్యులు తెలిపారు. ఆమె కోసం ఎవరూ రాలేదని అంత్యక్రియల కోసం మున్సిపల్ సిబ్బందిచే ఏర్పాట్లు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు. భిక్షాటన చేస్తూ జీవనం సాగించే మహిళగా గుర్తించినట్లు తెలిసిందని అన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

కాలం చెల్లిన విత్తనాల పట్టివేత

అచ్చంపేట రూరల్: వ్యవసాయాధికారులు, పోలీసు ఉన్నతాధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఎరువుల దుకాణదారుల తీరు మారడం లేదు. అచ్చంపేటలో రెండు రోజులుగా వ్యవసాయ శాఖ, పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తనిఖీల్లో ఓ దుకాణంలో కాలం చెల్లిన విత్తనాలను పట్టుకున్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న దుర్గా ట్రేడర్స్ దుకాణంలో కాలం చెల్లిన 286 కిలోలకు సంబంధించిన వరి విత్తనాల బస్తాలను ఏఓ కృష్ణయ్య, పట్టణ రెండో ఎస్ఐ రవి గుర్తించారు. మండల వ్యవసాయాధికారి కృష్ణయ్య అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నకిలీ విత్తనాలు అమ్మినా, కాలం చెల్లిన విత్తనాలు అమ్మినా కఠినచర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.


అచ్చంపేటలోని దుర్గా ట్రేడర్స్ దుకాణంలో కాలం చెల్లిన విత్తనాల బస్తాలను పరిశీలిస్తున్న అధికారులు

కప్పెటలో విషాదం

- అమెరికాలో జరిగిన రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి
- మృతదేహాన్ని త్వరగా తెప్పించాలి వేడుకుంటున్న తల్లిదండ్రులు


ఇంటి వద్ద రోదిస్తున్న మహేష్ తండ్రి వెంకట్రాములు

మహబూబ్‌నగర్ క్రైం: భూత్పూర్ మండలంలోని కప్పెటకు చెందిన బోయ మహేష్ అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు గ్రామస్తుల చేత కంటతడి పెట్టించాయి. సమాచారం తెలుసుకుని బంధువులు, సన్నిహితులు పెద్దఎత్తున మహేష్ ఇంటికి చేరుకుని తల్లిదండ్రులను ఓదార్చారు. ఈ సందర్భంగా మహేష్ తండ్రి వెంకట్‌రాములు మాట్లాడుతూ తన కుమారుడి మృతదేహాన్ని త్వరగా తెప్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని కోరారు. ఈ విషయమై గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సమాచారం ఇచ్చారని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ప్రజాప్రతినిధులు వీలైనంత త్వరగా మృతదేహాన్ని తెప్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్రగాయాలు

అచ్చంపేట రూరల్: మండలంలోని కన్యతండాలో ఓ యువకుడు విద్యుత్ స్తంభంపై వైర్లను సరి చేస్తుండగా ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్‌కు గురై తీవ్రగాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన ప్రకాష్ విద్యుత్ లైన్‌మెన్ కన్న వద్ద సహాయకుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం కన్యతండాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడంతో లైన్‌మెన్ సూచన మేరకు ప్రకాష్ సరిచేయడానికి స్తంభం ఎక్కాడు. ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై స్తంభంపై నుంచి కిందపడగా.. శరీర భాగాలు కాలాయి. వెంటనే స్థానికులు అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రెఫర్ చేశారు.

బెట్టింగ్ కేసులపై ఎస్పీ ఆరా

సాక్షి ఎఫెక్ట్..

గద్వాల క్రైం: జోగుళాంబ జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ వ్యవహారం, ముఠా అరెస్టు తదితర విషయాలపై ఎస్పీ సృజన ఆరాతీశారు. ఈ క్రమంలో క్రికెట్ బెట్టింగ్ ముఠాను ఏపీ పోలీసులు అరెస్టు చేసినట్లు బుధవారం 'సాక్షి'లో 'క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో జిల్లా పోలీసుశాఖ అప్రమత్తమైంది. ఈ నెల 10న ఏపీలోని కర్నూలు జిల్లా ఆదోని మూడో పట్టణ సీఐ శ్రీరాం ఆధ్వర్యంలో జోగుళాంబ జిల్లాలోని వడ్డేపల్లి మండలం తనగలలో బెట్టింగ్ నిర్వాహకుడు, కీలక ముఠా సభ్యుడు వడ్ల రాఘవేంద్రఆచారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఏపీ పోలీసులు ఇక్కడి వ్యక్తిని అదుపులోకి తీసుకున్న విషయంపై ఎస్పీ దృష్టిసారించారు. శాంతినగర్ సీఐ శివశంకర్‌గౌడ్‌తో అయిజ, గద్వాల, శాంతినగర్ పరిధిలో అయిజకు చెందిన ముఠా సభ్యుడితో బెట్టింగ్ కాశారా.. ఎవరెవరు ఉన్నారు.. నగదు, ఆన్‌లైన్ చెల్లింపుల విషయంపై వివరాలు తెలుసుకున్నారు. జిల్లాలో 2017లో బెట్టింగ్ కేసులో పట్టుబడిన జాబితాను సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఎవరైనా రాజకీయ నాయకులు, ప్రముఖులు, యువకులు, క్రీడాకారులు, ఉద్యోగులు, వ్యాపారులు సైతం ఉన్నట్లు గుర్తించారు. అయిజకు చెందిన వ్యక్తి గతంలోనూ హైదరాబాద్, కర్ణాటక, గోవా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ప్రధాన బుకీలతో పెద్దఎత్తున లావాదేవీలు జరిపినట్లు అప్పట్లో జిల్లా పోలీసులు గుర్తించి 120 మందిపై కేసులు నమోదు చేశారు. అయితే ఇన్నాళ్లు స్తబ్దుగా ఉన్న జిల్లాలో మరోసారి అయిజకు చెందిన బెట్టింగ్ నిర్వాహకుడిని అరెస్టు చేయడంతో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ విషయమై శాంతినగర్ సీఐ శివశంకర్‌గౌడ్‌ను 'సాక్షి' వివరణ కోరగా బెట్టింగ్ నిర్వాహకుడిని ఏపీ పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై అక్కడి పోలీసు అధికారులతో మాట్లాడామన్నారు. అయితే ఈ వ్యవహారంలో ఎవరెవరు ఉన్నారనే విషయంపై ప్రస్తుతం ఎస్పీ ఆదేశాల మేరకు విచారణ చేపట్టామని, బెట్టింగ్‌కు సంబంధించిన ముఠా సభ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

క్లుప్తంగా...

48 రోజులు.. రూ.1.62 కోట్లు

భద్రాద్రి రామయ్యకు భారీగా ఆదాయం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం హుండీ ఆదాయం 48 రోజులకు రూ.1,62,13,534 సమకూరింది. ఆలయ హుండీలను ఈవో రమాదేవి, దేవాదాయ శాఖాధికారుల సమక్షంలో చిత్రకూట మండపంలో బుధవారం లెక్కించారు. పై నగదుతో పాటు 182 గ్రాముల బంగారం, కేజీ 800 గ్రాముల వెండివచ్చాయని ఈవో తెలిపారు. ఇంకా 200 యూఎస్ డాలర్లు, 100 ఒమన్ బైసాలు, 60 యూకే యూరోలు, శ్రీలంకకు చెందిన వెయ్యి రూపీస్‌తో పాటు ఇతర విదేశీ నగదు కూడా లభించిందని వెల్లడించారు.

అరుణ మరణం అవాస్తవం

చర్ల: మావోయిస్టు పార్టీ చర్ల – శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ అనారోగ్యంతో మృతి చెందినట్లు పోలీసులు, ప్రభుత్వం చేస్తున్న వార్తల్లో నిజం లేదని...ఆ తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పార్టీ చర్ల – శబరి ఏరియా కమిటీ బుధవారం లేఖ విడుదల చేసింది. అరుణకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని, ప్రభుత్వ, పోలీసుల ప్రకటన అవాస్తవమని పేర్కొంది. పార్టీపై కుట్రలో భాగంగానే ఇలాంటి ప్రచారం చేస్తున్నారని ఆరోపించింది. 2024 నాటికి మావోయిస్టు పార్టీని నిర్మూలించాలనే లక్ష్యంతోనే పాలకులు బహుముఖ దాడులకు పాల్పడుతున్నారని పేర్కొంది. అరుణ క్షేమంగా ఉందని, పార్టీ కార్యకలాపాల్లో, విప్లవోద్యమంలో చురుగ్గా పాల్గొంటోందని, దీన్ని ప్రజలు గమనించాలని కోరింది. కాగా, మావోయిస్టులు విడుదల చేసిన లేఖపై అరుణ సంతకమే ఉండటం గమనార్హం.

కేతు విశ్వనాథరెడ్డికి కన్నీటి వీడ్కోలు

ఎర్రగుంట్ల/ కడప వైఎస్సార్ సర్కిల్: సాహితీ శిఖరం ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి (84)కి వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల మండలంలోని రంగసాయిపురంలో బుధవారం కుటుంబసభ్యులు, ఆప్తుల నడుమ అంత్యక్రియలు జరిగాయి. అంతకుముందు కడప నుంచి ఆయన భౌతికకాయాన్ని ఇక్కడి స్వగృహానికి తీసుకొచ్చారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టరు మూలె సుధీర్‌రెడ్డి, మాజీ మంత్రి డీఎల్ రవీంద్రనాథ్‌రెడ్డి, కార్మిక నాయకుడు ఎం.రమణారెడ్డి, టీడీపీ నాయకుడు లింగారెడ్డితో పాటు పలువురు రచయితలు, సాహితీవేత్తలు, నాయకులు పాల్గొన్నారు. కాగా, కేతు విశ్వనాథరెడ్డి మృతి బాధాకరమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆవేదన వెలిబుచ్చారు. కడప సింగపూర్ టౌన్ షిప్‌లో బుధవారం ఉదయం కేతు విశ్వనాథరెడ్డి భౌతికకాయం వద్ద ఆయన నివాళులర్పించారు.

వివేకాను హత్య చేసిన వాళ్లు విచ్చలవిడిగా బయట తిరుగుతున్నారు

▶ మొదటి పేజీ తరువాయి

చికిత్స పొందుతున్న వైఎస్ అవినాశ్‌రెడ్డి తల్లి శ్రీలక్ష్మిని ఆమె పరామర్శించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీ మోహన్‌రెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ''శ్రీ లక్ష్మిని పరామర్శించా. ఆమె ఆరోగ్యం ఆందోళనకరంగానే ఉంది. ఆమె త్వరగా కోలుకోవాలని ప్రార్థించా. వైఎస్ భాస్కర్‌రెడ్డి జైల్లో ఉన్నారు. అవినాశ్‌ను కూడా అరెస్టు చేస్తారనే ప్రచారం జరుగుతోంది. సీబీఐ వ్యవహారంతో ఒక తల్లిగా శ్రీలక్ష్మి తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. తల్లడిల్లిపోతున్న ఆమెను చూసి దేవుడిని ప్రార్థించేందుకు ఆసుపత్రికి వచ్చా'' అని వ్యాఖ్యానించారు. శ్రీలక్ష్మి ఒక దశలో డెత్ స్టేజీకి వెళ్లి బయటకు వచ్చారని, తనతో చాలాసార్లు నాతో దైవసేవకు కూడా వచ్చారని వైఎస్ విమలమ్మ తెలియజేశారు.

చానెల్స్‌లో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు...

అవినాశ్‌ను టార్గెట్ చేసి సీబీఐ అధికారులు వెళ్తున్నట్లు అనిపిస్తోందని, టీవీ చానల్స్‌లో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమలమ్మ ఆవేదన వ్యక్తంచేశారు. ''వైఎస్ వివేకానందరెడ్డి అన్న మంచి పేరుతో బతికారు. ఆయన హత్య తర్వాత ఆ మంచితనానికే మచ్చ తెస్తున్నారు. ఇది చాలా అన్యాయంగా ఉంది. రాజకీయంగా కూడా ఎంత మంచిగా ఉన్నాడో అందరికీ తెలుసు. అనవసరంగా అవినాష్‌ను లక్ష్యంగా చేసుకుని సీబీఐ ముందుకెళ్తోంది. ఇదెంతమాత్రమూ న్యాయం కాదు. దయజేసి గమనించండి. మీడియా వల్ల ప్రజలకు సరైన విషయాలు తెలియాలి. ఆ ఉద్దేశంతోనే మీడియా పనిచేయాలి. అదే బాగుంటుంది. న్యాయం ఆలస్యమైనా గెలుస్తుంది. దేవుడు ఎప్పుడూ అన్యాయం చేయడు. తల్లి ప్రార్థనలు దేవుడు ఆలకిస్తూనే ఉన్నాడు'' అని విమలమ్మ వ్యాఖ్యానించారు. 'అత్తా! నేను ఏ తప్పు చేయలేదని, నేను దేవున్ని నమ్ముతున్నానని, నాకు న్యాయం జరుగుతుందని చాలా ధైర్యంగా అవినాశ్ నాతో ఆస్పత్రిలో చెప్పారు!' అని అన్నారు. తప్పు చేస్తే అది మొహంలో తెలిసిపోతుందని చెప్పారామె.

సునీత వెనక దుష్టశక్తులున్నాయి...

ఒకవైపు కూతురు లాంటి మేనకోడలు సునీత, మరోవైపు సోదరుడి కుమారుడు అవినాశ్ ఉన్నారని విమలమ్మ వ్యాఖ్యానించారు. ''ఎవరు తప్పు? ఎవరు ఒప్పు? అనేది దేవుడికే తెలియాలి. అయితే అవినాశ్‌రెడ్డి మాత్రం ఏ తప్పూ చేయలేదనే నమ్మకం నాకుంది. తన తండ్రి హత్య వెనుక ఈ కుటుంబ సభ్యులు లేరని సునీతే గతంలో చెప్పింది. మళ్లీ ఇపుడు ఎందుకు మాట మారుస్తోందో తెలియడం లేదు. కానీ సునీత వెనుక దుష్టశక్తులు ప్రభావం చూపుతున్నాయని నాకు అనిపిస్తోంది. ఎందుకంటే నేను గతంలో ఆమెతో మాట్లాడాను. నువ్వు చేస్తున్నది తప్పని చెప్పా. నలుగురు వ్యక్తులు మేమే చంపామని చెబుతుంటే ఎందుకు ఏ తప్పూ చేయని వారిని టార్గెట్ చేశావని అడిగా. ఆధారాలు లేనప్పుడు అవినాశ్‌ను ఎందుకు లక్ష్యం చేశావని అడిగా. కానీ ఆమె మాట్లాడేందుకు ఇష్టపడలేదు. మనం దేవుని బిడ్డలం.. దేవుడే చూసుకుంటాడు. ఇలాంటివి చేయకమ్మా అని చెబితే సునీత వినలేదు'' అని విమలమ్మ వివరించారు. ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ... ''ఎలాంటి రుజువులూ లేనప్పుడు ఒక వ్యక్తిని టార్గెట్ చేయడం సరైంది కాదు. పోనీ ఆధారాలు చూపించమంటే చూపించేందుకు ఎవరూ సిద్ధంగా లేరు. సున్నిత మనస్తత్వం ఉన్న అవినాశ్‌ను టార్గెట్ చేయడం అన్యాయం అనిపిస్తోంది'' అని వ్యాఖ్యానించారు. ఏ తప్పూ చేయని అన్న (వైఎస్ భాస్కర్‌రెడ్డి) జైలులో ఉన్నాడని, 72 ఏళ్ల ఆయనకు వెన్నెముక నొప్పి ఉన్నా కేసులు పెట్టారని, ఏం జరుగుతుందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. తన సోదరుడు వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు తమ కుటుంబాలు ఎంతో సంతోషంగా ఉండేవని, ఇప్పుడు ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవడం చాలా బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశం అనంతరం మాజీ మంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఆస్పత్రి ఎదుట ఎమ్మెల్యేలు, కార్యకర్తల నిరసన

వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ వాస్తవాలు తేల్చాలని, బాధితులకు న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు కోరారు. బుధవారం వారు విశ్వభారతి ఆస్పత్రి ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఐదురోజులుగా వందల సంఖ్యలో కార్యకర్తలు ఆస్పత్రి ఎదుటే రాత్రింబవళ్లు ఉంటున్నారు. తల్లి అనారోగ్యంతో ఆమె బాగోగులు చూసుకుంటున్న అవినాశ్‌కు మద్దతుగా వారు అక్కడే ఉన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు కూడా ఆస్పత్రికి వచ్చి శ్రీలక్ష్మిని పరామర్శించి వెళుతున్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి శ్రీలక్ష్మిని పరామర్శించారు. తర్వాత ఆస్పత్రి ఎదుట వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాచమల్లు, హఫీజ్‌ఖాన్, సుధాకర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మేయర్ బీవై రామయ్య, కడప, కర్నూలు కార్పొరేటర్లు, మండలాధ్యక్షులు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు శాంతియుతంగా నిరసన చేపట్టారు. అవినాశ్‌కు అండగా కార్యకర్తలు ఆస్పత్రి ఎదుట ప్రశాంతవాతావరణంలో బైఠాయించడం మినహా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకపోవటంతో బుధవారం పోలీసు బందోబస్తును తగ్గించారు.

గుడిసెల తొలగింపులో తోపులాట

- పెట్రోలు పోసుకుని ఒకరి ఆత్మహత్యాయత్నం
- మహబూబాబాద్ శివారులో ఉద్రిక్తత

మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారులో పేదలు వేసుకున్న గుడిసెల తొలగింపులో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు, గుడిసెవాసుల మధ్య తోపులాట, వాగ్వాదం జరిగింది. గుడిసెలను తొలగించేందుకు వచ్చిన జేసీబీని అడ్డగించి ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మరో ఇద్దరు మహిళలు అస్వస్థతకు గురయ్యారు. జిల్లా కేంద్రం శివారు కురవి రోడ్డులోని 255/1 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో ఇటీవల సీపీఎం ఆధ్వర్యంలో 2



జేసీబీ ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న గుడిసెవాసులు

వేల మంది పేద ప్రజలు గుడిసెలు వేసుకున్నారు. అయితే పలుమార్లు పోలీసులు వాటిని తొలగించడం, పేదలు మళ్లీ గుడిసెలు వేయడం పరిపాటిగా మారింది. మళ్లీ బుధవారం ఉదయం ఆర్డీఓ కొమురయ్య, తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి పోలీసులతో కలసి గుడిసెల ప్రాంతానికి వెళ్లారు. జేసీబీలతో గుడిసెలను తొలగించే ప్రయత్నం చేయగా గుడిసెవాసులు అడ్డుకున్నారు. మహిళలు అధికారులను అడ్డగించి ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో ఓ యువకుడు తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా.. పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు పంపించారు. ఆర్డీఓ కొమురయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేయడం సరికాదని, అర్హులైన పేదలకు ప్రభుత్వమే స్థలాలు కేటాయిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా పలువురు సీపీఎం నాయకులు, కొంత మంది గుడిసెవాసులను పోలీసులు అరెస్ట్ చేశారు. అస్వస్థతకు గురైన ఇద్దరు మహిళలను ఆస్పత్రికి తరలించారు.

లక్షన్నర కుటుంబాలు | 4 లక్షల ఎకరాలు

తుది దశకు చేరిన పోడు భూమి లెక్కలు..
పట్టాల పంపిణీకి సర్వం సిద్ధం
జూన్ 25 నుంచి ప్రారంభం

సాక్షి, మహబూబాబాద్: పోడు భూముల పట్టాల పంపిణీ కోసం రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లుగా చేస్తున్న కసరత్తు తుదిదశకు చేరుకుంది. మంత్రి వర్గ ఉప సంఘం, అనుభవజ్ఞులైన అధికారులు, గిరిజన ప్రజాప్రతినిధులు, నాయకులతో సీఎంకేసీఆర్ పలుమార్లు జరిపిన చర్చలు, సమీక్షల ఫలితంగా పట్టాల పంపిణీ ప్రక్రియ పట్టాలెక్కుతోంది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో అందిన దరఖాస్తులను పరిశీలించి 4 లక్షల ఎకరాలకు పట్టాలు పంపి ణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది.

ఇతర రాష్ట్రాల్లో పరిశీలించి..

పోడు పట్టాల పంపిణీ కోసం రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులను గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పరిశీలించారు. పట్టాలు ఎవరికి ఇవ్వాలి? ఏ ప్రాతిపదికన అర్హులను గుర్తించాలనే తర్జనభర్జన పడ్డారు. ఇందులో భాగంగా 2016, 2021లో దేశంలో ఎక్కడెక్కడ పోడు రైతులకు పట్టాలు ఇచ్చారనే వివరాలు సేకరించారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, జార్ఖండ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఎంతమంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు? అందులో ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ఎంతశాతం భూమికి పట్టాలు ఇచ్చాయి.. ఇతర వివరాలు పరిశీలించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2006లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి తెలంగాణలోని హైదరాబాద్ మినహా తొమ్మిది ఉమ్మడి జిల్లాలకు చెందిన 99,486 మంది రైతులు సాగుచేసుకునే 3,31,070 ఎకరాలకు అటవీ హక్కుల చట్టం ద్వారా భూ హక్కు పత్రాలను అందజేశారు. దీనిని కూడా పరిగణనలోకి తీసుకుని, అప్పుడు అర్హులనుగుర్తించిన విధానం, పట్టాల పంపిణీ తర్వాత గిరిజనుల్లో మార్పు మొదలైన అంశాలను పరిశీలించినట్లు సమాచారం.

23 వరకు వచ్చిన అర్జీలు పరిగణనలోకి..

ఈ నేపథ్యంలోనే రాష్ట్రవ్యాప్తంగా గిరిజనులు సాగుచేసుకుంటున్న 4,05,601 ఎకరాలకు ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టాల పంపిణీకి ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 23 వరకు వచ్చిన అర్జీలను పరిగణనలోకి తీసుకొని 1,50,012 మంది రైతులకు పట్టాలు అందజేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 50,595 మంది రైతులకు 1,51,195 ఎకరాలు, మహబూబాబాద్ జిల్లాలో 24,972 మంది రైతులకు 70,434 ఎకరాలు.. అత్యల్పంగా పెద్దపల్లి జిల్లాలో ముగ్గురు రైతులకు ఎకరం భూమికి పట్టాలు అందించనున్నారు.

జిల్లాల్లో సభలు పెట్టి..

పోడు పట్టాలు జూన్ 24 నుంచి అందించనున్నారు. గిరిజనులు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో సీఎం కేసీఆర్‌తో సభలు పెట్టి ఆయన చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేయనున్నట్లు మంత్రులు చెబుతున్నారు. మొదటి సభ భద్రాద్రి కొత్తగూడెంలో కానీ, మహబూబాబాద్‌లో కానీ నిర్వహించే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రానికి ఈశాన్యం మూలలో ఉన్న ఈ రెండు జిల్లాల్లో పట్టాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గిరిజనులకు స్వర్ణయుగం

దేశ చరిత్రలో అశోక చక్రవర్తి పరిపాలనా కాలాన్ని స్వర్ణయుగంగా చరిత్ర చెబుతుంది. తెలంగాణ గిరిజనులకు మాత్రం ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన స్వర్ణయుగం వంటిది. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మా తండాలు, గిరిజన ఆవాసాలను పంచాయతీలుగా ప్రకటించారు. అడుగకుండానే 10 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఇప్పుడు అటవీ భూములకు హక్కు పత్రాలు అందజేస్తున్నారు. ఈ జాబితానే కాకుండా ఇంకా అర్హులు మిగిలి ఉంటే అధికారులకు చెప్పండి వారికి కూడా హక్కు పత్రాలు వస్తాయి.

– సత్యవతి రాథోడ్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి

పోడు భూమి హక్కుపత్రాల జాబితా

జిల్లా	దరఖాస్తులు	భూమి (ఎకరాలు)
భద్రాద్రి కొత్తగూడెం	50,595	1,51,195
మహబూబాబాద్	24,972	70,434
ఆసిఫాబాద్	15,254	44,750
ఆదిలాబాద్	12,222	31,683
ములుగు	7,413	18,869
నిర్మల్	7,257	20,051
ఖమ్మం	5,857	9,779
కామారెడ్డి	4,480	12,969
నిజామాబాద్	3,788	7,697
వరంగల్	3,654	8,366
భూపాలపల్లి	3,428	8,537
మంచిర్యాల	2,403	5,024
నల్లగొండ	2,256	4,426
నాగర్‌కర్నూల్	1,956	4,968
రాజన్న సిరిసిల్ల	1,614	2,857
సంగారెడ్డి	1,128	1,807
మెదక్	610	524
వికారాబాద్	434	554
వనపర్తి	311	379
యాదాద్రి భువనగిరి	186	427
సూర్యాపేట	84	189
హనుమకొండ	70	65
మహబూబ్‌నగర్	19	22
జగిత్యాల	15	19
నారాయణపేట	03	08
పెద్దపల్లి	03	01
మొత్తం	1,50,012	4,05,601

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి స్వల్ప ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం ఎగువ నుంచి 1,622 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రాజెక్టులో 7.498 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. 152 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

1,019 అడుగుల నీటి మట్టం

మదనాపురం: రామన్‌పాడు జలశయంలో బుధవారం నీటి మట్టం 1,019 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వకు వచ్చే నీటిని నిలిపివేశారు. రామన్‌పాడు నుంచి ఎన్‌టీఆర్ కాల్వకు నీటిని నిలిపివేసారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

పోలీసుల అదుపులో వస్త్ర వ్యాపారి?

గద్వాల క్రైం: వ్యాపారం కోసం తెలిసిన వడ్డీ వ్యాపారులు, ప్రైవేట్ బ్యాంకుల నుంచి రూ.కోటిన్నర అప్పు తీసుకుని అయిదు రోజుల క్రితం తప్పించుకున్న వ్యాపారిని బుధవారం గద్వాల పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. రాజస్థాన్‌కు చెందిన వ్యాపారి క్రిష్ణవేణి చౌరస్తాలోని షాపును అద్దెకు తీసుకుని రెడీమేడ్ దుస్తుల వ్యాపారం నాలుగేళ్లుగా చేస్తున్నాడు. వ్యాపారం డెవలప్‌మెంట్ కోసం గద్వాలకు చెందిన వడ్డీ వ్యాపారులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రైవేటు బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో అప్పులు తీసుకున్నాడు. తిరిగి చెల్లించే క్రమంలో అలసత్వం వహించాడు. అప్పులు ఇచ్చిన వ్యాపారులు రూ.లక్షకు అయిదు నుంచి పది రూపాయల మేర వడ్డీలు వసూలు చేసినట్లు తెలిసింది. ప్రైవేట్ బ్యాంకుకు, వ్యాపారులకు వడ్డీలు మాత్రం చెల్లిస్తూ వచ్చాడు. కొన్ని నెలలుగా వడ్డీ, అప్పు చెల్లించకపోవడంతో వారంతా ఒత్తిడి చేయడంతో ఈనెల 18 నుంచి అజ్ఞాతంలోకి వెళ్లాడు. దీంతో వడ్డీ వ్యాపారస్తులు ఆందోళనలో పడ్డారు. చేసేది లేక షాపు అద్దెకు ఇచ్చిన యజమాని సహాయంతో కొందరు వడ్డీ వ్యాపారులు పట్టణ పోలీసులను ఆశ్రయించారు. అయితే బుధవారం పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై సంబంధిత ఎస్‌ఐ రామస్వామిని సాక్షి వివరణ కోరగా.. వస్త్ర వ్యాపారిని అదుపులోకి తీసుకోలేదని చెప్పారు. దుకాణంలో విలువైన వస్త్రాలు, సామాగ్రి ఉన్నట్లు మా దృష్టికి తీసుకువచ్చాడు. పోలీసుల సమక్షంలో వాటిని తీసుకువెళ్లేందుకు అనుమతి కోసం రావడం జరిగిందన్నారు. ఇక అప్పుల చెల్లింపు విషయంపై ఇప్పటివరకు ఫిర్యాదు చేయలేదు. ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

'పాలమూరు' పనులను సీఎం పర్యవేక్షించాలి

సీపీఎం రాష్ట్ర నాయకుల బృందం డిమాండ్

కొల్లాపూర్ రూరల్: పాలమూరు ప్రాజెక్టు పనులలో వేగం పెరగాలంటే, త్వరగా పూర్తి కావాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే ప్రాజెక్టును సందర్శించాలని, పనులను పర్యవేక్షించాలని సీపీఎం రాష్ట్ర నాయకుల బృందం డిమాండ్ చేసింది. కొల్లాపూర్ మండల పరిధిలోని ఎల్లూరు గ్రామ సమీపంలో చేపట్టిన పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించిన ఇన్‌టెక్ వెల్, పంప్‌హౌజ్, అంజనగిరి, నార్లాపూర్ రిజర్వాయర్, ప్రధాన కాల్వ పనులను బుధవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లి, రాష్ట్ర నాయకులు సాగర్, ధర్మనాయక్, పాలమూరు ఉమ్మడి జిల్లా కార్యదర్శులతో కలిసి సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. చేసిన పనులకు నిధులు మంజూరు చేయకపోవడం వల్లే ఆలస్యమవుతోందని అన్నారు. ఇప్పటివరకు రూ.4వేల కోట్ల పనులు జరిగితే ప్రభుత్వం రూ.2వేల కోట్లు మంజూరు చేసినట్లు తెలిసిందన్నారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి త్వరితగతిన చేసిన పనులకు డబ్బులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పనులు జరగడంలో ఇప్పటికే చాలా ఆలస్యం అయిందన్నారు. ఇక్కడి నుంచి 8 టీఎమ్‌సీల నీటిని ఎత్తిపోయాల్సి ఉందని,



ప్రాజెక్టుకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర బృందం

ఆ పనులను త్వరగా పూర్తి చేస్తేనే పాలమూరు, రంగారెడ్డి జిల్లాల వలసలు ఆగడానికి ఆస్కారం ఉంటుందన్నారు.

ముఖ్యమంత్రి స్పందించి ప్రాజెక్టు మొత్తం పూర్తి కావడానికి నిధులు పెంచిన విధంగా రూ.45వేల కోట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 12లక్షల ఎకరాలకు, 12వేల గ్రామాలకు తాగు, సాగునీరు ఒకేసారి అందించడానికి నిధుల కొరత లేకుండా, పనులు త్వరగా పూర్తయే విధంగా ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉదండాపూర్ నుంచి జరిగే కాల్వల పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చెప్పిన విధంగా జూలై నాటికి ప్రాజెక్టు నుంచి పాలమూరు, రంగారెడ్డి ప్రజలకు నీటిని ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి పర్వతాలు, వనపర్తి జిల్లా కార్యదర్శి జబ్బార్, కొల్లాపూర్ మండల కార్యదర్శి శివవర్మ, ఈశ్వర్, దశరథం తదితర నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి కల్యాణం

ఎర్రవల్లిచౌరస్తా: శ్రీరాముని జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు దత్తుస్వామి ఆధ్వర్యంలో సీతారాముల విగ్రహాలను అందంగా ముస్తాబు చేసి వేదమంత్రాల నడుమ వైభవంగా కళ్యాణం చేశారు. భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. పవిత్ర కృష్ణానదిలో స్నానాలు ఆచరించారు. ఆలయంలో మేనేజర్ సురేందర్‌రాజు ఆధ్వర్యంలో కళ్యాణం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులకు ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



రాములోరికి కళ్యాణం చేస్తున్న అర్చకులు

నేడు ఉమ్మడి జిల్లాలో వర్షాలు

బిజినేపల్లి: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పాలెం కేవీకే వాతావరణ విభాగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. వరిపంట కోసుకునే రైతులు, ధాన్యాన్ని ఆరబెట్టుకునే రైతులు తప్పకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వాడ్ని బండెక్కించండి..

- బీజేపీ కార్యకర్తలపై ఎమ్మెల్యే గువ్వల ఆగ్రహం



బీజేపీ, బీఆర్‌ఎస్ కార్యకర్తల మధ్య కొనసాగుతున్న వాగ్వాదం

బల్మూర్: తన ప్రసంగంపై అభ్యంతరం వ్యక్తం చేసిన బీజేపీ కార్యకర్తలపై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బీజేపీ, బీఆర్‌ఎస్ కార్యకర్తల నడుమ తీవ్ర ఉద్రిక్తకు దారితీసింది. బుధవారం బల్మూర్ మండలం బాణాలలోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతుండగా.. ఆలయ ప్రాంగణంలో రాజకీయాలు మాట్లాడటమేంటని గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు సోలంకి శ్రీను, నరేశ్ అడ్డుకున్నారు. ఈ క్రమంలో 'అరేయ్.. ఏంట్రా.. వాడ్ని బండి ఎక్కించండి' అంటూ గువ్వల ఆగ్రహానికి లోనయ్యారు. దీంతో బీజేపీ, బీఆర్‌ఎస్ కార్యకర్తల మధ్య కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు.

మరింత తగ్గిన ఉల్లి ధర

- గరిష్టంగా రూ.వెయ్యి.. కనిష్టంగా రూ.400

దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం జరిగిన బహిరంగ వేలంలో ఉల్లి ధరలు మరింత దిగజారాయి. ఉల్లి సీజన్ ముగుస్తున్నప్పటికీ ధరలు మాత్రం పెరగడం లేదని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌లో నాణ్యమైన ఉల్లి క్వింటాల్ ధర గరిష్టంగా రూ.వెయ్యి వరకు పలికింది. రెండో రకం ఉల్లి రూ.600 నుంచి రూ.800 వరకు ధరలు వచ్చాయి. చిన్నగా ఉన్న ఉల్లి గరిష్టంగా రూ.400 వరకు పలికింది. మార్కెట్‌కు దాదాపు 500 బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది. ఇక మార్కెట్ బయట సైతం రైతులు నేరుగా ఉల్లి విక్రయాలు సాగించారు. మార్కెట్‌లో నాణ్యమైన ఉల్లి 45 కిలోల బస్తా ధర రూ.500 వరకు విక్రయించారు. రెండో రకం ఉల్లి రూ.300– 400 వరకు అమ్మకాలు జరిగాయి. చిన్న ఉల్లి రూ.200లకు బస్తాగా అమ్మగా.. మార్కెట్ బయట ధరలు ఒకేలా ఉన్నాయి.

వినియోగదారుల సందడి..

దేవరకద్ర మార్కెట్‌లో వినియోగదారుల సందడి కనింపించింది. చాలామంది ఉల్లిని నిల్వ చేసుకోడానికి పెద్దఎత్తున కొనుగోలు చేశారు. ఇక చిరు వ్యాపారులు సైతం ఉల్లిని కొనుగోలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు ఉల్లిని వాహనాల్లో తరలించారు. కొందరు వ్యాపారులు నేరుగా ఉల్లి బస్తాలను తెచ్చి మార్కెట్ బయట అమ్మకాలు సాగించారు.



మార్కెట్‌లో ఉల్లిని కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

వరి ధాన్యం కొనుగోలులో అక్రమాలు

- రోడ్డుపై ఆందోళనకు దిగిన అన్నదాతలు
- తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన తహసీల్దార్

మహమ్మదాబాద్: వరిధాన్యం కొనుగోలులో పలు అక్రమాలు జరుగుతున్నాయని ఆగ్రహించిన అన్నదాతలు బుధవారం మధ్యాహ్నం రోడ్డెక్కారు. మహమ్మదాబాద్ మండల పరిధిలోని నంచర్లలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం సేకరణలో సరియైన తూకంతో ధాన్యం సేకరించకుండా మిల్లర్లతో కుమ్మక్కయ్యి ఎలాంటి ట్రక్ షీట్ రసీదులు ఇవ్వకుండానే మిల్లులకు పంపిస్తున్నారు. బంధిత మిల్లరు బస్తాకు కిలో రెండు కిలోల చొప్పున కోత పెట్టి.. ఎన్ని బస్తాలు లెక్కకు వచ్చాయో అని చెప్పిన తర్వాతనే కొనుగోలు కేంద్రం నుంచి ట్రక్‌షీట్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ప్రతి వంద క్వింటాళ్ల దగ్గర ఐదు క్వింటాళ్లపైనే కోత పెడుతున్నారని మండిపడిన రైతులు రోడ్డెక్కి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఆంజనేయులు అక్కడికి వెళ్లి పీఏసీఎస్ సిబ్బంది, రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో తూకంలో మోసం చేయడంతో పాటు రైస్ మిల్లులో కూడా మోసం చేస్తున్నారని తహసీల్దార్‌కు రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా తూకం చేయాలని తూకం చేసిన వెంటనే ట్రక్ షీట్ రశీదు ఇవ్వాలని కొనుగోలు సిబ్బందిని ఆదేశించారు.రైతులతో మాట్లాడి తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. బుధవారం లేబర్ లేకపోవడంతో ధాన్యం తూకం చేయలేదు. గురువారం నుంచి క్రమం తప్పకుండా ధాన్యం తూకం చేయించాలని ఆదేశించారు.



నంచర్ల వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్